# సిమెంట్ ధరలకు రెక్కలు?

**ఈ ఆర్థిక సంవత్సరం 4 శాతం వరకు విజృంభించనున్న రేట్లు**

**మార్కెట్‌లో 7.5 శాతం మేరకు పెరగనున్న డిమాండ్: క్రిసిల్ అంచనా**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశీయ మార్కెట్‌లో సిమెంట్ ధరలు 2 నుంచి 4 శాతం (రూ.15-20) మేరకు పెరిగే వీలున్నట్టు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ, విశ్లేషణ సంస్థ క్రిసిల్ ఓ తాజా రిపోర్టులో అంచనా వేసింది. అలాగే డిమాండ్ 6.5 శాతం నుంచి 7.5 శాతం వరకు పెరగవచ్చని కూడా అన్నది. ప్రధాన మౌలిక వసతుల కల్పనకు, గ్రామీణ హౌజింగ్ ప్రాజెక్టులకు ఈసారి బడ్జెట్‌లో 10 శాతం దాకా కేటాయింపులు పెరగడం, రాబోయే వర్షాకాలంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు అవుతుందన్న అంచనాలు సిమెంట్ వినియోగాన్ని, పరిశ్రమను ఉత్సాహపరుస్తున్నాయని పేర్కొన్నది. వ్యవసాయం లాభసాటిగా మారితే గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణాలు ఊపందుకుంటాయని కూడా క్రిసిల్ ఇంటిలిజెన్స్ అసోసియేట్ డైరెక్టర్ సచిదానంద్ చౌబే చెప్తున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2024-25) సిమెంట్ ఇండస్ట్రీలో వృద్ధిరేటు 4.5-5.5 శాతంగానే ఉన్నది. అయితే లోక్‌సభ ఎన్నికలు, అంతకుముందు మూడు ఆర్థిక సంవత్సరాల్లో అధిక వృద్ధిరేట్లే ఇందుకు కారణమని చెప్తున్నారు.

**మౌలికమే దన్ను**

రోడ్ల నిర్మాణాలు ఈ ఆర్థిక సంవత్సరం పెద్ద ఎత్తున జరిగే వీలుండటం సిమెంట్ వినియోగపు అంచనాల్ని అమాంతం పెంచేస్తున్నాయని క్రిసిల్ అంటున్నది. రైల్వేలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ మౌలిక సదుపాయాల కల్పన కూడా జోరుగా జరుగవచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలోనే సిమెంట్‌కు గిరాకీ బాగా పెరగవచ్చని క్రిసిల్ అంచనా వేస్తున్నది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై), మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్‌ఆర్‌ఈజీఏ) వంటి పథకాలు సైతం సిమెంట్ ఇండస్ట్రీకి దన్నునిస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. మొత్తానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండే ఈసారి సిమెంట్ పరిశ్రమ ఆదాయానికి కీలకంగా మారనున్నాయి.

**పట్టణ డిమాండ్ అంతంతే**

దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో నిర్మాణ రంగం నిరాశాజనకంగా ఉండటం సిమెంట్ పరిశ్రమకు ఎదురుదెబ్బగానే విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. గృహ రుణాలపై వడ్డీరేట్లు ఆశించిన స్థాయిలో తగ్గకపోవడం కొనుగోలుదారులను నిరుత్సాహపరుస్తున్నదని చెప్తున్నారు. ఇప్పటికే పెరిగిన నిర్మాణ వ్యయం కూడా కష్టమర్లను వేచిచూసే ధోరణిలోకి నెడుతున్నదని, దీంతో ఇప్పటికే నిర్మించిన ఇండ్లు అమ్ముడుపోక, కొత్త ప్రాజెక్టులపై రియల్టర్లు పెద్దగా ఆసక్తి చూపట్లేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఇండ్ల అమ్మకాలు పడిపోవడం, మార్కెట్‌లో స్తబ్ధత నెలకొనడం పరిశ్రమకు ప్రతికూలమని అభిప్రాయపడుతున్నారు. అయితే హైదరాబాద్‌సహా ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పుంజుకొంటే సిమెంట్ ధరలు ఇంకా పెరిగే వీలుందన్న అంచనాలూ ఉన్నాయి.

# లక్ష రూపాయలు దాటిన పుత్తడి

**మరో రూ.1,800 పెరిగిన తులం ధర**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. తొలిసారిగా లక్ష రూపాయల మైలురాయిని అధిగమించి రికార్డు నెలకొల్పింది పుత్తడి. దేశీయ రాజధానిలో పదిగ్రాములు బంగారం ధర రూ.1,800 ఎగబాకి లక్ష రూపాయల పైకి చేరుకున్నది. ప్రాంతీయ ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు వచ్చేవారంలో అక్షయ తృతీయ, ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్ కావడంతో డిమాండ్ అధికంగా ఉంటుందన్న అంచనాతో ధరలు భారీగా పెరుగుతున్నాయి. ట్రేడ్ వార్‌తో ప్రపంచ దేశాల ఆర్థికంపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణం. దీంతో ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిప పుత్తడి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600కి చేరుకున్నది. సోమవారం ఇది రూ.99,800గా ఉన్నది. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు బంగారం ధర రూ.22,650 లేదా 29 శాతం ఎగబాకింది. మరోవైపు, వెండి ధరలు నిలకడగా రూ.98,500 వద్ద స్థిరంగా ఉన్నాయి. అలాగే హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం గోల్డ్ ధర రూ.3,000 ఎగబాకి రూ.1,01,350కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.98,350గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.2,750 అందుకొని రూ.92,900 పలికింది. కిలో వెండి రూ.1,11,000గా నమోదైంది.



**అక్షయ తృతీయకు డిమాండ్ అంతంతే**

రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలతో సామాన్యుడితోపాటు సంపన్నవర్గాలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. ఈనెల 30న అక్షల తృతీయ సందర్భంగా కొనుగోళ్లు భారీగా తగ్గే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**బంగారం ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు**

- **టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా చర్యలు తీసుకుంటుండటం**
- వడ్డీరేట్ల తగ్గింపుపై ఫెడరల్ రిజర్వు చీఫ్ జెరోమ్ పోవెల్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య వివాదం నెలకొనడం
- **చైనాతోపాటు ప్రపంచవ్యాప్తంగా కేంద్రబ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం**
- అమెరికా కరెన్సీ డాలర్ బలహీనపడటం

# ఆరో రోజూ లాభాల్లో సూచీలు

ముంబై, ఏప్రిల్ 22: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లకు లభించిన మద్దతుతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులు పెట్టడం సూచీల్లో జోష్ పెంచింది. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 187.09 పాయింట్లు అందుకొని 79,595.59 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 41.70 పాయింట్లు ఎగబాకి 24,167.25 వద్ద స్థిరపడింది. భారీగా లాభపడ్డ సూచీలకు ఐటీ, ఎనర్జీ రంగ షేర్లు బ్రేక్‌లు వేశాయని, అయినప్పటికీ రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్ రంగ సూచీలు ఇచ్చిన దన్నుతో లాభాల్లో ముగిశాయి. ఐటీసీ, హెచ్‌యూఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..మరోవైపు ఇండస్ఇండ్ బ్యాంక్ 4.88 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 2.40 శాతం లాభపడగా, ఎఫ్‌ఎంసీజీ 1.87 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 1.43 శాతం, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగ సూచీలు లాభపడగా..టెక్నాలజీ, ఐటీ, పవర్, యుటిలిటీస్, టెలికం రంగ షేర్లు నష్టపోయాయి.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రికార్డు**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నది. మంగళవారం సంస్థ షేరు 2 శాతం లాభపడటంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లు దాటింది. ఈ మైలురాయికి చేరుకున్న మూడో సంస్థ కూడా హెచ్‌డీఎఫ్‌సీ కావడం విశేషం. గడిచిన పదిహేను రోజుల్లో బ్యాంక్ షేరు 11 శాతం లాభపడటంతో మార్కెట్ క్యాప్ రూ.1,50,289.64 కోట్లు పెరిగి రూ.15,01,289.37 కోట్లుగా నమోదైంది.

# సత్తా చాటిన తెలంగాణ తేజాలు

- **సాయి శివానీకి 11వ ర్యాంకు**
- **కానిస్టేబుల్ కుమారుడికి 68వ ర్యాంకు**
- **టాప్-10లో తెలంగాణకు దక్కని చోటు**
- **100లో 13 మంది తెలుగు విద్యార్థులు**
- **తెలుగు రాష్ట్రాల నుంచి 78 మంది ఎంపిక**
- **1,009 మంది ఫలితాలు విడుదల**



సాయిశివాని



జయసింహారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) వెలువరించిన సివిల్స్-2024 తుది ఫలితాల్లో తెలంగాణకు ర్యాంకుల పంట పండింది. రాష్ర్టానికి చెందిన ఎట్టబోయిన సాయిశివాని 11వ ర్యాంకు సాధించింది. వరంగల్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన చింతకింది శ్రావణ్‌కుమార్‌రెడ్డి 62వ ర్యాంకు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సాయి చైతన్యజాదవ్ 68వ ర్యాంకుతో అదరగొట్టారు. అయితే టాప్-10లో ఒక్కరు కూడా తెలంగాణకు చెందిన వారు లేరు. ఈ సారి మొత్తం గా 1,009 మంది ఫలితాలను యూపీఎస్సీ విడుదల చేయగా, క్యాటగిరీవారీగా తీసుకుంటే జనరల్ 335, ఈడబ్ల్యూఎస్ 109, ఓబీసీ 318, ఎస్సీ 160, ఎస్టీ 87 క్యాటగిరీ అభ్యర్థులున్నారు. ఈ సారి తెలంగాణ, ఏపీ నుంచి సివి ల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారి సంఖ్య పెరిగింది. రెండు రాష్ట్రాల నుంచి 78 మంది ఎంపికైనట్టు లా ఎక్సలెన్స్ డైరెక్టర్ రాంబాబు పాలడుగు అంచనావేశారు. టాప్-100లో 13 మంది తెలుగు విద్యార్థులున్నట్టు విశ్లేషించారు.

**కోచింగ్ తీసుకోకుండా 11వ ర్యాంకు**

వరంగల్ శివనగర్‌కు చెందిన సాయిశివాని కోచింగ్ తీసుకోకుండానే, సొంత ప్రిపరేషన్‌లో, నిపుణుల మార్గదర్శనంలో ఏకంగా ఆలిండియా 11వ ర్యాంకు సాధించడం గమనార్హం.

**కానిస్టేబుల్ కొడుకు.. కలెక్టర్ కాబోతున్నడు**

నాన్న కానిస్టేబుల్. అమ్మ టీచర్. సివిల్స్ ప్రయత్నంలో ఐదు సార్లు విఫలమయ్యాడు. అయినా ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. క్రమపద్ధతిలో హార్డ్‌వర్క్‌చేసి సక్సెస్ సాధించాడు సాయిచైతన్య జాదవ్. తల్లిదండ్రులిచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని, 68వ ర్యాంకు వస్తుందని ఊహించలేదని సాయిచైతన్య తెలిపాడు. హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి స్టేట్ రెండో టాపర్(46వ ర్యాంక్)గా నిలిచాడు. నల్లమలకు చెందిన దళిత యువకుడు మొదటిసారే సత్తా చాటాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ వాసి సాయికిరణ్ 298వ ర్యాంక్ సాధించాడు. హనుమకొండలోని బాలసముద్రంకు చెందిన హరిప్రసాద్ 255వ ర్యాంక్ సాధించాడు.

| పేరు | ర్యాంకు |
|---|---|
| ఎట్టబోయిన సాయి శివానీ | 11 |
| రావుల జయసింహారెడ్డి | 46 |
| చింతకింది శ్రావణ్ కుమార్‌రెడ్డి | 62 |
| సాయిచైతన్య జాదవ్ | 68 |
| కొలిపాక శ్రీకృష్ణ సాయి | 190 |
| కౌశిక్ నర్సింహ | 225 |
| పోతరాజు హరిప్రసాద్ | 255 |
| సాయికిరణ్ | 298 |
| రాపర్తి ప్రీతి | 451 |
| బానోతు నాగరాజు నాయక్ | 697 |
| తొగరపు సూర్యతేజ | 799 |
| గోకమల్ల ఆంజనేయులు | 934 |
| రామటెంకి సుధాకర్ | 949 |

# సివిల్స్ ఫలితాల్లో నారీశక్తి

- **యూపీకి చెందిన శక్తి దూబేకు ఫస్ట్ ర్యాంకు**
- **టాప్-5లో ముగ్గురు మహిళలు**
- **టాప్-20లో ఏకంగా 11 మంది**
- **ఫలితాలు ప్రకటించిన యూపీఎస్సీ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్- 2024 ఫలితాల్లో నారీశక్తి ప్రతిబింబించింది. టాప్-5లో ముగ్గురు యువతులు ఉండగా, టాప్-20లో ఏకంగా 11 మంది చోటు దక్కించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన శక్తి దూబేను మొదటి ర్యాంకు వరించిం ది. హర్షితా గోయల్‌కు రెండో ర్యాంకు, షా మార్గి చిరాగ్ నాలుగో ర్యాంకు దక్కించుకున్నారు. డోంగ్రే అర్చిత్ పరాగ్‌కు మూడో ర్యాంకు, ఆకాశ్ గార్గ్‌కు ఐదో ర్యాంకు లభించినట్టు యూపీఎస్సీ మంగళవారం ప్రకటించింది. ప్రథమ ర్యాంకర్ శక్తి దూబే యూపీలోని అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. రెండవ ర్యాంకు సాధించిన హర్షితా గోయల్ ఎంఎస్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా నుంచి బీకాం పట్టభద్రురాలు. మూడో ర్యాంకు సాధించిన డోంగ్రే అర్చిత్ పరాగ్ తమిళనాడులోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పట్టభద్రుడు. నాలుగో ర్యాంకు సాధించిన షా మార్గి చిరాగ్ అహ్మదాబాద్‌లోని గుజరాత్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో బీఈ పట్టా పొందారు.




ఖిలాషాపురంలో రైతువేదికపై కొట్టుకుపోయిన రేకులు

## ఉరుములు, మెరుపులతో వర్షం

**జనగామ మార్కెట్‌లో తడిసిన ధాన్యం**

జనగామ (నమస్తే తెలంగాణ)/రఘునాథపల్లి, ఏప్రిల్ 22 : జిల్లాలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ముందుజాగ్రత్తగా ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పగా, మరికొందరు రైతులకు చెందిన ధాన్యం స్వల్పంగా తడిసింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు. అయితే ఈదురు గాలులు, ఉరుములతో వర్షం కురవడంతో పలుచోట్ల వరి దెబ్బతినగా, మామిడి తోటల్లో కాయలు రాలి రైతులు నష్టపోయారు. జనగామ మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చిన ధాన్యం రాశులను తేమ పేరుతో వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో చాలా మంది రైతులు యార్డులో ఆరబోసుకున్నారు. సాయంత్రం వర్షం కురవడంతో కొంత మేరకు తడిసింది. రఘునాథపల్లి మండలం ఖిలాషాపురంలో గాలిదుమారానికి రైతువేదిక రేకులు ఎగిరిపోయాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు తడిసాయి. మండలంలో సుమారు 40 ఎకరాల్లో వరి నేలవాలిగా, మామిడి రైతులకు నష్టం వాటిల్లిందని పలువురు తెలిపారు.

**వెంకటేశ్వరపల్లిలో రోడ్డుపై విరిగి పడిన చెట్లు**



వెంకటేశ్వరపల్లెలో రోడ్డుపై విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు : గాలి దుమారంతో చిల్పూరు మండలం వెంకటేశ్వరపల్లెలో చెట్టు విరిగి రోడ్డుపై పడింది. దీంతో విద్యుత్ తీగలు తెగి రాకపోకలు స్తంభించాయి. స్పందించిన స్థానిక ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి జేసీబీ సాయంతో చెట్టు ను, తీగలను తొలగించి రవాణకు అంతరాయం లేకుండా చూశారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ సురేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ ఇంద్రాచారి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాలల కుదింపు**

## ఆలోచనను సర్కారు విరమించుకోవాలి

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 22 : ప్రభుత్వ పాఠశాలల కుదింపు ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ లింగారెడ్డి అన్నారు. సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ జిల్లా కమిటీ వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగింది. లింగారెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సంస్కరణల పేరుతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పాఠశాలలను కలిపే కుట్రపూరితమైన ఆలోచనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల డీఏలను విడుదల చేసి, పీఆర్‌సీని ప్రకటించాలన్నారు. అనంతరం డీటీఎఫ్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ షరీఫ్, ఉపాధ్యక్షులుగా చొక్కయ్య, సుశీల, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఇప్ప రాంరెడ్డి, కార్యదర్శులుగా యాదయ్య, దూడయ్య, యాదగిరి, శివరాం, సోమయ్య, జీ కళావతి, శ్రీనివాసచారి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాస్, సూర్య ప్రకాశ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, సోమనారాయణ, గోవర్ధన్, వెంకటాచారి, కృష్ణ, జగ్గారెడ్డి, జహంగీర్, సోమరాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- **యువకుడి దారుణ హత్య**
- **ప్రధాన నిందితుడు కానిస్టేబుల్, మరో ఐదుగురి అరెస్ట్**
- **వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్**



నిందితుల అరెస్టను చూపిస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

సుబేదారి, ఏప్రిల్22: వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటనలో కానిస్టేబుల్, మరో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ సన్‌ప్రీత్ సింగ్ నిందితుల వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా వాజేడు వెంకటాపురం(నూగూరు)కు చెందిన చిడెం సాయిప్రకాశ్ ఈనెల 15న హనుమకొండలో అదృశ్యమైనట్లు అతడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు టెక్నాలజీతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. నిందితుల్లో ఒకరైన డేవిలీ సాయిని అదుపులో తీసుకొని విచారించగా, అతడి ఇచ్చిన సమాచారం మేరకు మిగతా నిందితులను అరెస్ట్ చేశారు. వెంకటాపురం(నూగూరు)లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చింతగట్టుకు చెందిన బాషబోయిన శ్రీనివాస్ సాయిప్రకాశ్ పిన్ని(బాబాయ్ భార్య)తో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో సాయిప్ర కాశ్, అతడి బాబాయ్ ములుగు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి సస్పెండ్ చేశారు. దీన్ని మనసులో పెట్టుకున్న కానిస్టేబుల్ సరైన సమయం కోసం వేచిచూశాడు. ఈ నెల 15న సాయిప్రకాశ్, బాబాయ్, పిన్ని నిర్మల కలిసి కారులో హనుమకొండ హాస్పిటల్‌కు వచ్చారు. ఈ విషయాన్ని అతడి పిన్ని కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వెంటనే అతడు గుంటూరు జిల్లాకు చెందిన డేవిలీ సాయి, హనుమకొండకు చెందిన అరుణ్‌కుమార్, అఖిల్ నాయక్, రాజు అర్ధరాత్రి సాయిప్రకాశ్ కారును ఆటోలో వెంబడించారు. హనుమకొండ గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు బేబీ సైనిక్ స్కూల్ వద్ద అడ్డగించి అదే కారులో సాయి ప్రకాశ్‌ను ఎక్కించుకొని హసన్‌పర్తి శివారులో తీవ్రంగా కొట్టి, గొంతును శాలువాతో బిగించి హత్య చేశారు. ఆ తర్వాత హుస్నాబాద్ సమీపంలోని జిల్లేడుగడ్డ తండా శివారులోని బావిలో సాయి ప్రకాశ్ మృతదేహాన్ని పడేశారు. నిందితులను అరెస్ట్ చేసి కారు, రెండు ఆటోలు, రెండు బైక్‌లు, ఎయిర్ పిస్తోల్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీపీ పేర్కొన్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సతీశ్, సిబ్బందిని సీపీ అభినందించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జఫర్‌గఢ్, ఏప్రిల్ 22 : మండలంలోని రఘునాథపల్లి, సూరారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఐకేపీ ఏపీఎం రవీందర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని వివరించారు. ధాన్యం తీసుకొచ్చే రైతులకు సౌకర్యాలను కల్పించాలని నిర్వాహకులను ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ బొమ్మినేని శ్రీదేవీ పెద్దిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, రాజు, కుమార్, సీసీ నర్సింగం పాల్గొన్నారు.

**మందకృష్ణ మాదిగకు**

## త్వరలో ఘన సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 22 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు త్వరలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘన సన్మానం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యులు బొడ్డు దయాకర్ మాదిగ తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. బొడ్డు దయాకర్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ నేతృత్వంలో మూడు దశాబ్దాల పోరాటంతో ఎస్సీ వర్గీకరణ సాకారమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్, స్టేషన్ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గాదె శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల సుధాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లో వోల్టేజీ సమస్య నివారణకు ప్రత్యేక కృషి



ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న ఎస్ఈ వేణుమాధవ్

బచ్చన్నపేట, ఏప్రిల్ 22 : వ్యవసాయ పంపుసెట్లకు లోవోల్టేజీ సమస్య రాకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తున్నామని ట్రాన్స్‌కో వరంగల్ ఎస్ఈ వేణుమాధవ్ వెల్లడించారు. మంగళవారం మండలంలోని లక్ష్మాపూర్ సబ్‌స్టేషన్‌లోని 5.5 ఎంవీఏతో లోవోల్టేజీ వస్తుందని రైతులు చెప్పడంతో వెంటనే స్పందించిన ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగించేందుకు చర్యలు తీసుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఎస్ఈ మాట్లాడుతూ జనగామ డివిజన్ పరిధిలో ఎక్కడ లోవోల్టేజీ సమస్య ఉన్నా వెంటనే స్పందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జనగామ డీఈ టెక్నికల్ గణేశ్, డీఈ ఆపరేషన్ లక్ష్మినారాయణ, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బచ్చన్నపేట, ఏప్రిల్ 22 : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని మహిళా సంక్షేమాధికారి ఫ్లోరెన్స్ అన్నారు. మంగళవారం మండలంలోని లింగంపల్లి క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు నాగిరెడ్డిపల్లిలో పోషణ పక్షోత్సవాలు, గ్రాడ్యుయేషన్ దినోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ కవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీడబ్ల్యూవోతో పాటు జనగామ ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, ఎంపీడీవో మల్లికార్జున్, ఎంఈవో వెంకట్‌రెడ్డి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, సీసీ నర్సింహులు, మిషన్‌వశక్తి కోఆర్డినేటర్ శారద, వెబ్ ప్రతినిధి పవిత్ర, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**దేవరుప్పులలో..**

దేవరుప్పుల : మండలంలోని నీర్మాల అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ప్రీస్కూల్ చదువు పూర్తి చేసుకున్న చిన్నారులకు వీడ్కోలు పలికారు. గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించగా మాజీ సర్పంచ్ ఎడమ ఇందిర వారికి చీరలు అందించారు. బల్లి సంతోషిణి గాజులు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, టీచర్లు నిర్మల, ఉమ, లక్ష్మీ, పాఠశాల హెచ్ఎం కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

**లింగాలఘనపురంలో..**

లింగాలఘనపురం : ఆకుకూరల్లో అధిక పోషకాలుంటాయని, చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో జలేంధర్‌రెడ్డి అన్నారు. లింగాలఘనపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషక పక్షోత్సవాల సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హంసమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, విజయలక్ష్మి, ఇందిర, అనిత తదితరులు పాల్గొన్నారు.

**పారదర్శకంగా**

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

**వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 22 : ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారి, మున్సిపల్ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్‌తో పాటు మంత్రి పొంగులేటి జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి చట్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదల సొంతింటి కళను నిజం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ నెల 30వ తేదిలోపు ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారిగా అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇళ్లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రజలకు భారం కాకుండా ఉండడానికి 25 శాతం రాయితీని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రాజీవ్ యువ వికాసం పథకంపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. అర్హులైన లబ్దిదారులు స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి సాధించడానికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, ఆర్డీవోలు గోపీరామ్, వెంకన్న, డీఆర్డీవో వసంత తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారుల అవినీతిని అరికట్టాలి

చిల్పూరు, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందని, అధికారుల అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్ సర్కారును కోరారు. పార్టీ మండల కమిటీ సమావేశం మంగళవారం ఆవుల ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. రమేశ్ మాట్లాడుతూ రైతుల అమాయకత్వం ఆసరాగా చేసుకున్న రెవెన్యూ అధికారులు భూసమస్యలను పరిష్కరించడం లేదన్నారు. డబ్బులిస్తేనే ఫైలు కదులుతుందన్నారు. ఇందుకు నిదర్శనమే రెండు రోజుల క్రితం లంచం తీసుకున్న ఆర్ఐ ఏసీబీకి చిక్కడమన్నారు. చిల్పూర్ గుట్ట దేవాదాయ భూమి 229 సర్వే నంబర్‌లో దాదాపు 300 ఎకరాలకు పైగా ఉన్న భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు ప్రభాకర్ శ్రావణ్, బర్మా రవి తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

వరంగల్‌చౌరస్తా, ఏప్రిల్ 22: జిల్లా నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్న వారికి వరంగల్ ఐఎంఏ హాల్‌లో మంగళవా రం ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. డీఎంహె చ్‌వో డాక్టర్ సాంబశివరావు సమక్షంలో ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో బయో ఓరల్ పోలి యో వ్యాక్సిన్, క్వార్టరీ వాలెంటల్ మెనిగోకకల్, సీజనల్ ఇన్ఫ్లూజా వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని 53 మందితోపాటు భూపాలపల్లికి చెందిన మరో ఇద్దరు కలిపి మొత్తం 55 మందికి వ్యాక్సిన్ వేశామన్నారు.

## ఒకరి అదృశ్యం

కరీమాబాద్, ఏప్రిల్ 22: నగరంలో ఒకరు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు మంగళవారం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివనగర్‌కు చెందిన రమేశ్ నగరంలోని బంగారం దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 16న పని కోసం వెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.